క్లుప్తంగా

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

సిర్పూర్(టి): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని డోర్‌పల్లి, వేంపల్లి, అచ్చెల్లి, భూపాలపట్నం, సిర్పూర్(టి), హుడ్కిలి, లక్ష్మీపూర్, కర్జపెల్లి, మేడిపల్లి గ్రామ పంచాయతీల్లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో కృష్ణమూర్తి, ఏపీవో చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు



పట్టుకున్న ట్రాక్టర్లతో ఎస్సై

ఆసిఫాబాద్‌రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో చిర్రకుంట వాగు నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా.. గురువారం ఉదయం 5 గంటలకు జెండగూడ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవన్నారు. ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గంగన్న, పీసీ సంజీవ్ ఉన్నారు.

ఘనంగా కేంద్రమంత్రి జన్మదిన వేడుకలు



చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న నాయకులు

బెజ్జూర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్‌కట్ చేయించి సంబురాలు జరుపుకున్నారు. జై బండి సంజయ్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తంగడపల్లి నిలేష్, నేరెళ్ల సంతోష్, బెనికి శ్యాంసుందర్, మహేశ్, ఓంప్రకాష్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అధికారులు

కెరమెరి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలకు మీసేవ కేంద్రాలు కేటాయించాలి



మాట్లాడుతున్న భరత్

కెరమెరి: మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మీసేవ కేంద్రాలను ఆదివాసీ మహిళలకు కేటాయించాలని పేసా మండల కోఆర్డినేటర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆదివాసీ మహిళలు ఆర్థికంగా బలహీన పడి ఉన్నారని, వారి ఆర్థికాభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమురం లక్ష్మణ్, ఆత్రం మాధవరావు, ఆత్రం సాగర్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

బెజ్జూర్: గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం లోపిస్తున్నప్పటికీ సంబంధిత ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్ల చుట్టూ ఖాళీ స్థలాలుంటే నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి తొట్టిలపై మూతలు పెట్టాలి. నీటి ట్యాంకులను మూడు, నాలుగు రోజు లకు ఒకసారి శుభ్రం చేయాలి. ఎక్కువ రోజులు శుభ్రపర్చకుండా ఉన్నట్లయితే దోమలు వ్యాప్తి చెదే అవకాశం ఉంటుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్తాచెదారం..

బెజ్జూర్ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో గల గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో జనాలు అవస్థలు పడుతున్నారు. చెత్తాచెదారంతో డ్రెయినేజీలు నిండిపోయాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండడంతో పాటు కొంత అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. వానకాలంలో ఎక్కువ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వర్షపు నీరు నిల్వ ఉండి గుంతలుగా మారి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయి. వర్షాకాలం సీజన్‌లో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

వీధిదీపాలు లేక అంధకారం..



ఎలుకపల్లిలో రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ మురుగు

పలు గ్రామపంచాయతీల్లో వీధి దీపాలు లేక పల్లెలు అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చిమ్మచీకటిలో పాములు, తేళ్లు, క్రిమికీటకాలు సంచరిస్తుండడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, పరిసరాల, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది సూచనలు పాటించాలి. మురుగు నీటిని తొలగించిన తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి. కొబ్బరి బోండాల వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు మిగిలిన చెత్తను పరిసరాల్లో వేయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవాలి.

అప్రమత్తతోనే వ్యాధులు దూరం..



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ అవినాష్‌కుమార్, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

'జర్నలిస్టులపై దాడి అమానుషం'

కాగజ్‌నగర్ రూరల్: ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళన వార్తల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. గురువారం దాడికి నిరసనగా పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాగజ్‌నగర్ ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్‌తో పాటు సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసులు లాఠీచార్జి చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించడం సరికాదన్నారు. పోలీసులు తమ తప్పుడు విధానాలు మానుకోవాలని సూచించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టి.సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుమలాచారి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్, ముంజం ఆనంద్‌కుమార్, కంబాల రమేశ్ జర్నలిస్టుల పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

'కసాబ్‌వాడీ'ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీ ప్రాంతంలో గురువారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పర్యటించారు. వర్షపు నీరు రహదారిపై చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 9న సాక్షిలో 'చెరువును తలపిస్తున్న రహదారి' పేరుతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం మున్సిపాలిటీ నిధులు రాగానే కొత్తగా డ్రెయినేజీ నిర్మిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని పైకాజీనగర్ కాలనీలో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది శంకర్, తదితరులు ఉన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ భుజంగరావు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

దహెగాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి పెద్దన్న అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలన్నారు. అదే విధంగా వర్షపు నీరు నిల్వకుండా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ.. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, ఈజీఎస్ ఏపీవో కల్పన, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కౌటాల: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కౌటాల ఏపీఎం ముక్తేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం సూర్యచంద్ర మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తుందన్నారు. మహిళ శక్తి పేరిట మీసేవ, డైరీ, పశుమిత్ర, చేపల పెంపకం, కోళ్ల పెంపకం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేస్తామని, స్వయం సహాయక సంఘాల సభ్యులు పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు కమల, మీరా, సీసీలు విలాస్, శంకర్, కుష్మ, రాజమణి, కల్పన, సిబ్బంది గీత, తిరుపతమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ముక్తేశ్వర్

కనీస సామర్థ్యాలు పెంచండి

కెరమెరి: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచాలని ఐటీడీఏ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంవో) పుర్క ఉద్ధవ్ అన్నారు. గురువారం మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పదాలను బోర్డుపై రాయించారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అనార్‌పల్లి హెచ్ఎం బలిరాం, డిప్యూటీ వార్డెన్ వసంత్‌రావు, ఎస్సీఆర్పీ నరేశ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏసీఎంవో

విద్యతోనే సమాజంలో గుర్తింపు

వాంకిడి: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్సై సాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు ఆటపాటలతో మంచి, చెడు విషయాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ చర్యలు, చదువు ప్రాముఖ్యత, మంచి, చెడు అలవాట్లు, మహిళా భద్రత వంటి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై సాగర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాల జోలికి వెళ్లకూడదని సూచించారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపకులు, కళాజాత బృందం సభ్యులు రోహిత్, రాంచందర్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సాగర్

'భగీరథ' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను, వేతనంగా రూ. 26వేలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో రెవెన్యూ, హౌసింగ్, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఐఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత 20 సంవత్సరాలుగా లైన్‌మెన్‌గా, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్స్‌గా, హెల్పర్, స్టోర్ వృత్తిలో పని చేస్తున్నామన్నారు. 2018 సంవత్సరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి జాతీయస్థాయిలో అవార్డులు, రివార్డులు తీసుకుందన్నారు. కనీస వేతనాలను అమలు చేయక, జీవో 60, 11లను తుంగలో తొక్కి కార్మికులకు నిర్లక్ష్యానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు మధుకర్, బుద్దయ్య, రాజేశ్వర్, రాజు, చవాన్, ప్రకాష్, సంతోష్, తదితరులు ఉన్నారు.

'భట్టి'కి స్వాగతం పలికిన కలెక్టర్

ఆసిఫాబాద్: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉట్నూర్‌లో నిర్వహించిన రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉపముఖ్యమంత్రికి పూల మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న కలెక్టర్

16న ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈనెల 16న గోలేటి లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

తిర్యాణి: దేశంలోని 17 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీలు కొనసాగుతున్న రజకులను తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ జాబితాలో చేర్చాల ని రజక సంఘం మండల అధ్యక్షుడు బూసి సంతోశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రజకుల చేపడుతున్న వృత్తి ఒక్కటే అయినప్పుడు కొన్ని రాష్ట్రాల్లో వేర్వేరు జాబితాలో ఉంచడం సరికాదన్నారు. ఒకే దేశం, ఒకే వృత్తి, ఒకే రిజర్వేషన్ వి దానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ లో ఏకగ్రీవ తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు నల్లూరి రాజు, కోశాధికారి దుర్శిశెట్టి సతీశ్, రాగళ్ల రాజమౌళి, నల్లూరి జగదీశ్, పున్నం కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీరింగ్ డే వేడుకలు

కాగజ్‌నగర్ రూరల్: తెలంగాణ ఇంజనీర్ నవాబ్‌జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని జీడిచేను గ్రామ పాఠశాలలో ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. నవాబ్ జంగ్ బహదూర్ నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు, వైరా ప్రాజెక్టు, అప్పర్‌మానేరు ప్రాజెక్టు, డిండి ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు వివరించారు. అంతకుముందు నవాబ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లావణ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మానస, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మి వారాహిదేవి పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శ్రీ లక్ష్మివారాహిదేవి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ తెలిపారు. వారాహినవరాత్రోత్సవ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో 'వనమహోత్సవం'

కెరమెరి: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని 51 పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను రక్షించే బాధ్యత విద్యార్థులపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు. ఈ సందర్భంగా మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. నాటిన మొక్కను తల్లితో సమానంగా చూస్తూ ప్రతీ రోజు రెండుసార్లు నీరు పోయాలన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జోడేఘాట్‌కు బస్సు నడపాలి

కెరమెరి: జోడేఘాట్‌కు ఆర్టీసీ బస్సును నడిపించాలని ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. కుమురం భీం పరిసర 18 గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామాల ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 2019 వరకు కొనసాగిన బస్సు ఆతర్వాత ఆర్టీసీ అధికారులు నిలిపివేశారని, ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ రాజేశ్వర్, సెడ్మకి తుకారాం, ఆత్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలో సెంటర్ ఫర్ ఎన్వీరాల్‌మెంట్ ఎడ్యూకేషన్, ఎస్పీఎం, స్పర్శ ఫౌండేషన్ వారు సంయుక్తంగా ప్లాస్టిక్ నిర్మూలనకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మెయిన్ మార్కెట్‌లోని కిరాణా, చిరు వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్‌ను నిర్మూలించడం, పర్యావరణ పరిరక్షణపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్, శివ, సుశీల, పాండు, సుందరం, పాల్గొన్నా రు.



ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

జూనియర్ ఈపీ ఆపరేటర్ల డిప్యూటేషన్ నిలిపివేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా నుంచి మణుగూరు ఏరియాకు జూనియర్ ఈపీ ఆపరేటర్లను డిప్యూటేషన్‌పై పంపించడాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి కోరారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కైరిగూడ ఓసీపీలో ఈపీ ఆపరేటర్ల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఆపరేటర్ల పిల్లల చదువులు, తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితుల కారణంగా కార్మికులు తాత్కాలిక బదిలీపై వెళ్లడంతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తాత్కాలిక బదిలీలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, కిరణ్‌బాబు, మారం శ్రీనివాస్, పుట్ట అంజన్న, రారాజు, గణేష్, సురేష్, మొగిళి, శ్రావణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ ఉద్యోగులు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం ఆరో రోజుకు చేరింది. జీవో నంబర్ 10 రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని కాగజ్‌నగర్ ప్రాజెక్టు అధ్యక్షురాలు వినోద స్పష్టం చేశారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు త్రివేణి, అరుణ, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, విజయకుమారి, శంకరమ్మ, సంధ్య, లక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద

గుట్కా పట్టివేత

జైనూర్: మండల కేంద్రంలో గురువారం ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా షేక్ సమీర్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచి రూ.950 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా గుట్కా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటల వివరాలు నమోదు

లింగాపూర్(ఆసిఫాబాద్): లింగాపూర్ మండలం చోర్‌పల్లి పంచాయతీ పరిధిలోని వంకామద్ది గ్రామంలో గురువారం జిల్లా వ్యవసాయాధికారి పంటల వివరాలు నమోదు చేశా రు. పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చే స్తేనే కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర లభిస్తుందన్నారు. పంటల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ఏఈవోలకు సూ చించారు. ఏవో షేక్ ఖలీల్ ఉన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ

బెజ్జూర్: ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అనుచరుడు సామల రాజన్న మాతృమూర్తి గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్ సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూర్ గ్రామానికి చేరుకున్నారు. సామల రాజన్న తల్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :

9010608462

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206

సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661

టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899